

# ప్రజాద్రోహి కథ

## ముళ్ళపూడి వెంకటరమణ

"మరెలక్షనుకి నిలబడే మాటేం చెప్పావు?" అన్నారు రామిరెడ్డిగారు.

"ఎవరూ?" అన్నట్టుగా చూశాడు సుబ్బరాజు.

"ఇంకెవరు నివ్వే."

సుబ్బరాజు నవ్వాడు.

"ఆయన నామినేషను పడేశాడుగా" అన్నాడు క్షణం ఆగి.

"దానికేటి పడేస్తే తీసేస్తాడు."

"అది సరే, ఈసారికిలా పోనిద్దాం. మీ మీద ఆశ బెట్టుకున్నాడు..." అన్నాడు సుబ్బరాజు.

"అది సర్లే. ఓ కథ చెబుతా విను ..." అంటూ కథ ఆరంభించారు రెడ్డిగారు.


"ఓ నాడు సందేశ ఇది గిలాగే ఓ పార్టీ పెద్దరెడ్డి, ఆయన బలగం కూర్చుని రాబొయ్యే ఎలక్షను గురించి మాటాడుతున్నారు సావిట్లో. అంతలో దూరంగా గేటవతల జటకా ఆగింది. అందులోంచి ఓ నడికారుమనిషి దిగాడు. దిగి లోపలకొస్తన్నాడు. ఆయన్ని ఆ తేజస్సుని చూడగానే అందరికీ మాట లాగిపోయాయి మసకెల్తురేమో మని

షెవరో గుర్తు తెలీలేదు. ఎవడో సీమదొర లాగున్నా డన్నారు. శాపం తగిలిన మినిష్టరన్నారు. కాదుత్తరాది నాయకు డన్నారు... అంతలో ఆయన రానే వచ్చాడు. చౌదరిగారు. ఆ వూరోడే. ఎలక్షనయి రాజధాని కెళ్ళిశాన్నాళ్ళ యింది. ఇదేరాక. తెలిసినోళ్ళుకూడా మరిచేపోయారు. ఆయనోడు తమ తరపున ఎక్కడో పన్జేస్తున్నాడని... ఆయన్రాగానే పెద్దిరెడ్డిగారు లేచి నిలబడి ఎదురెళ్ళి తీసుకొచ్చి కూచోబెట్టాడు. కుశల మడిగాడు. ఇదిగో ఇది నా రాజ్యం కావాలంటే ఇదంతా మీదే మేం నీవోళ్ళం అన్నాడు రెడ్డిగారు. అంత మాటెందు కన్నాడో ఆయన ఎత్తేమిటో అందరికీ తెలీదుగాని, ఏదో లేందే అనడని తెలుసు స్తిమితపడ్డాక, రెడ్డిగార్ని గదిలో కూర్చోబెట్టుకుని చౌదరిగారు తన కథ చెప్పుకొచ్చాడు.

పార్టీ ఇంద్రుడు ఆయనకి శాపం బెట్టాడు. పల్లీ కున్నలుగురుకీ తెలిసి పొయ్యేటంత యిదిగా డబ్బు గడిం చేస్తున్నాడనీ, పరువుల్దీసి పందిర్లేస్తున్నా డనీ తెలిసిందట. దానికితోడు, తన్ను ఎన్నుకున్న జనంవస్తే మొఖం చాటేశా డనీ, కంట్రకం అయేంత తిక్కలు పొయ్యాడనీ తెలిసింది. పేపర్లో దీన్ని గురించి రాశారట. దాంతో ఆయన క్కోపంవచ్చి 'ఓయీ చౌదరయ్యా నివ్వెళ్ళికొన్నేళ్ళపాటు ప్రజల్లో కలసి పోయి వొపవాసం జెయ్యి. నీ కింతే శాస్తి' అని శాపం బెట్టాడు. ఈన బరి తెగిం చెదిరించి పార్టీ నొదిలి స్వతంత్రు డుగా తిరిగాడు. ఇప్పటికి బైమైంది. ఈ దఫా ఎలక్షనుకి టికెట్లివ్వనన్నాడు ఇంద్రుడు. ఇచ్చినా ఎన్నుకోమన్నారు ఆ వాడప్రజల మనుషులు. సర్లేసూసుకో, నేనే తిరిగి ఎలక్షనయి నీ ఎదురుగుండా నిలవకపోతే, పీలైతే మంత్రి నవకపోతే చూసుకో అని శపథం బట్టి వొచ్చేశాడు చౌదరిగారు, అద్గదీ కత.

పెద్దిరెడ్డిగారికి ఆ పార్టీ ఇంద్రుడిమీద శాన్నాళ్ళుగా పంతంవుంది. పగకాద్ది సుమా. బావామరుదుల వొరసగా సరసా లాడుకుంటా రిద్దరూ ఎపుడన్నా కలిస్తే. కాని బలాబలాలు చూసుకోవాలని ఊబ లాటాలుండి పొయ్యాయి. సర్లేవయ్యా శరణిచ్చాను. నిన్నే నిలబెడతాను అన్నాడు రెడ్డిగారు. చౌదరిగారికాడ డబ్బాట్టేలేదు కూడాను. అయినాసరే నన్నాడు రెడ్డిగారు.

బావగారి క్కుబురంపాడు. ఇక్కడ మా చౌదర్నితప్ప మరొకర్ని పెడితే నెగ్గరని, దరిమిలాను స్వయంగావెళ్ళి వాదించాడు. ఆ పైన తన గ్రూపుల బలంమాపి నచ్చజెప్పాడు. పట్టిదుపుల ఒడుపులు దెలిసిన ఇంద్రుడు పకాల్న నవ్వి బయటికొచ్చి వొరండాలో కూర్చున్న చౌదర్ని కౌగిలించుకుని లోపలికి దీసుకువెళ్ళాడు. నాకేందయ్యా,




మీ నియోజకవర్గంలో జనానికి మోజు విరిగిపొయ్యిందనీ అసలు మర్చిపోయ్యా రనీ అక్కణ్ణించి వుత్తరాల్రాశారు. గిట్టనోళ్ళని వూరుకున్నాగాని శానామంది రాసేతలికి, మరీ యింతమందయితే ఇక లాభవేటని అలా చెప్పాను. నాదేముంది? నెగ్గితే నెగ్గు. టిక్కట్టిస్తాను అన్నాడు.

చౌదరి మొఖం వింతయింది పెద్దిరెడ్డి గారు నవ్వి దానికేవుంది, అది నే జూచుకుంటానన్నారు. అనుకున్నంత సులభంగాలేదుపని. వూళ్లో శానామంది కిష్టం లేదు. చౌదరీ మరికొంతమందికి అసలే అభిప్రాయంవూ లేదు అయనెవుడో తెల్దన్నట్టు మాటాడారు. ఈ లెక్కని పార్టీ టిక్కట్టుమీద నిలబడితే చాలా కంట్రకం అపుతుందనిపించింది రెడ్డిగారికి. అందుకో వుపాయంవాలోచించాడు

సర్లే మీకు గురిలేకపోతే ప్రస్తుతానికి ఇండిపెండెంటుగానే నిలబడతాళ్ళే. ఆనాక జూసుకోవచ్చునని పైకి కవురం పాడు రెడ్డిగారు చౌదరి స్వతంత్రుడుగా నిలబడ్డాడు. ప్రచారానికి సన్నాహాలు ఆరంభించారుగాని పెద్దిరెడ్డిగారు ఉత్సాహంజూపలే. ఎందుకూ డబ్బు దండగా అన్నారు. చెడవుద్దని వెనకాడుతున్నాడు గాబోలని చౌదరి కంగారు కడ్డాడు. అంతలో అదృష్టం బాగుపడి, బే వారసత్వం ఒకటి దారికొచ్చి డబ్బు తగిలింది. లంకెబిందెలే అనుకో.

ఇహ తగలేద్దారి పట్టండి డబ్బు అన్నాడు చౌదరి.

పెద్దిరెడ్డిగారు నవ్వాడు. "నివ్వంటే ఇష్టం లేదన్నవాళ్ళమీద ఎందుకు గుప్పించడం డబ్బు? ఓటుల్లేకపోతే గెలవ్వా? అన్నాడు, చౌదరి తెల్లబోయి ఇదేవిటన్నాడు. ఇంకో క్షణానికితనికే తోచింది దానర్థం.

'నిజవే, ఇలా వెదజల్లి ఆళ్లందరినీ తడిపి, హైరానాపడేబదులు 'అలాగే' చెయ్యొచ్చుగా అన్నాడు.

మర్నాడే రాయబారాలారంభించాడు.

గుట్టుచప్పుళ్ళేకుండా గుంభనంగా నడిచాయి.

ఎదిరివాళ్ళిద్దరికీ చెరి డెబ్భైఅయిదు వేలూ పరిహారంఇచ్చే పద్ధతిమీద ఒప్పందాలు కుదిరాయి. అంతలో, ఒకాయనకి పక్షవాతమొచ్చి పడిపొయ్యాడు. అక్కడితో ఆయనకిచ్చే డబ్బు ఆదా అయింది.

డెబ్భైఅయిదువేలు కలిసొచ్చిందని సంతోషించబోయాడు చౌదరి.

పెద్దిరెడ్డిగారు అడోలా నవ్వారు. ఇంకోగంటకి రెండోఆయన దగ్గర్నించి కబురొచ్చింది. "నేను నామినేషను తీసేసుకోటం లేదూ, నిలబడుతున్నానూ" అని.

రెడ్డిగారూ చౌదరిగారూ పరుగెత్తారు. గిరాకీపెరిగింది గాబట్టి లక్షాయాభై దగ్గర బేరం పెట్టాడవతల పెద్దమనిషి. గంటయ్యేసరికి, చచ్చిచెడి లక్షకి దింపారు. సాయంత్రానికి ఆ నామినేషను కూడా పోయింది.

చౌదరిగారు ఎన్నికయినట్టు మర్నాడు పేపర్లలో పడింది. ఇష్టంవున్న పేపర్లు 'ఏకగ్రీవంగా' అని రాశాయి. లేనివి 'పోటీలేకుండా' అని రాశాయి. చౌదరీ, రెడ్డిగారూ ఫగలబడి నవ్వుకున్నారు.

ఆ వాడ ప్రజలు నిర్ఘాంతపోయారు.

"సుబ్బరాజూ! నీకా ప్రజ్ఞవుందా? ప్రజల్ని బోల్తా కొట్టించి నెగ్గిన చౌదరి గారికి ఏం బహుమతి యిస్తావు? లేదా అది ద్రోహఁవనుకుంటే ఏఁవి శిక్ష వేస్తావు?" అన్నారు రామిరెడ్డిగారు కథ ఆపి.

"ప్రజాద్రోహి చౌదరిగారు కారు. డబ్బు తీసుకుని, నామినేషను ఉపసంహరించుకున్న అవతలి పెద్దమనిషి. చౌదరికి శిక్ష వెయ్యడం కష్టం. ఎలక్షను కడతేరా నడిపించి, ఆయనకెందరు ఓట్లు వేస్తారో చూడాలి. ఉన్న ఓటర్లలో నూటికేభై మందికి పైగా ఆయనకి ఓటేస్తే నెగ్గినట్టు. లేపోతే..."

"భ భ భ. పరువు దీశేశావు సుబ్బరాజూ. కడుపులో ఇలాటూహలు బెట్టుకుని పాలిటిక్సులోకెలా దిగావయ్యా" అన్నారు రెడ్డిగారు.

